క్లుప్తంగా

సహకార సంఘానికి త్రిసభ్య కమిటీ



కమిటీ సభ్యులను సత్కరిస్తున్న సీఈఓ

వరదయ్యపాళెం: మండలంలోని కదూరు సహకార సంఘానికి త్రిసభ్య కమిటీని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్‌గా అంబూరుకు చెందిన ఆణిముత్యం నందకిషోర్ రెడ్డి, సభ్యులుగా నెల్లటూరుకు చెందిన రమేష్, సీఎల్ఎన్‌పల్లెకు చెందిన రవిరెడ్డి నియమితులయ్యారు. శనివారం ఈమేరకు సహకార సంఘం కార్యాలయంలో సీఈఓ సంపత్ సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. కమిటీ సభ్యులను సీఈఓ సత్కరించారు.

వేడుకగా ఊంజల్ సేవ



ఊయలపై దేవదేవేరులు

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం దేవదేవేరులకు వేడుకగా ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లను తిరుచ్చిపై కొలువుదీర్చారు. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, అర్చకుడు నరసింహారాఘవ భట్టాచార్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

లారీ డ్రైవర్లకు కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రేణిగుంట: కరకంబాడిలోని అమర రాజా కంపెనీలో శనివారం అమర రాజా లాజిస్టిక్స్, ఎస్వీ అరవింద్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో లారీ డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 200 మంది డ్రైవర్లకు కంటి పరీక్షలు చేశారు. జనరల్ మేనేజర్ చంద్ర బాబు, వెంకట్ మాధవ్, రాళ్లపల్లి సతీష్ పాల్గొన్నారు.

జేసీబీ, టిప్పర్ సీజ్





సీజ్ చేసిన టిప్పర్, జేసీబీ

రేణిగుంట: మండలంలోని తూకివాకం సమీపంలో శనివారం అక్రమంగా ఇసుక తవ్వకాలు సాగిస్తున్న జేసీబీతోపాటు ఓ టిప్పర్‌ను గాజులమండ్యం పోలీసులు సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ మంజునాథరెడ్డి తెలిపారు.

అవార్డు గ్రహీతలకు సత్కారం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి: ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్న సుబ్రమణ్యంశర్మ, రుద్రయ్య, సుబ్బరామయ్యకు శనివారం పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆత్మీయ సత్కారం చేశారు. ప్రధానోపాధ్యాయులు తీగల వెంకటయ్య, రూపేష్, ఉపాధ్యాయులు లింకన్, స్టాలిన్, రుక్మానందరెడ్డి, మురళి, భాన్రుసాద్, గుణశేఖర్, జయశ్రీ, పద్మ, మంజుల, సరిత, పద్మజ, మంజుభార్గవి, సరస్వతి పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విద్యార్థులతో ఉపాధ్యాయులు

రేణిగుంట: మండలంలోని గుత్తి వారిపల్లె జెడ్పీ హైస్కూల్‌లో శనివారం హిందీ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. హిందీ టీచర్ గాయత్రి మాట్లాడుతూ హిందీ భాష ఆవశ్యకతను వివరించారు. ప్రధానోపాధ్యాయుడు విజయ్ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న కార్యవర్గం

శ్రీకాళహస్తి: ఊరందూరులో శనివారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని టౌన్‌బ్యాంకు నూతన చైర్మన్ ఖాదర్‌బాషా, కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే చొరవతోనే తమకు పదవులు వచ్చాయన్నారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్, సీఓ ధనంజయులు, కమిటీ సభ్యులు మురళి, బాబురెడ్డి, ఆర్ముగం, దొరబాబు, అనిల్‌కుమార్, రాంబాబు, గోవర్ధన్, కవిత పాల్గొన్నారు.

పడకేసిన పల్లెలు!



కేవీబీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జ్వర బాధితులు

పల్లె సీమలు మంచం పట్టాయి. వాతావరణ మార్పుల కారణంగా రోగాలు విజృంభిస్తున్నాయి. విష జ్వరాలు విపరీతంగా ప్రబలుతున్నాయి. పారిశుద్ధ్యం అధ్వాన్నంగా మారడంతో గ్రామాలు పడకేశాయి. ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. ఈ క్రమంలో వైద్యాధికారుల నిర్లక్ష్యం కారణంగా బాధితులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రజలను ముందస్తుగా అప్రమత్తం చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందారు. ఇదే అదనుగా ఆర్ఎంపీలు రోగులను నిలువునా దోచుకుంటున్నారు. అరకొర వైద్యం అందించి ప్రాణాలతో చెలగాట మాడుతున్నారు.

- ప్రబలిన విష జ్వరాలు
- ఆస్పత్రులకు పరుగులు తీస్తున్న బాధితులు
- ముందస్తు జాగ్రత్తలు చేపట్టని వైద్యాధికారులు
- రోగాల బారిన పడుతున్న గ్రామీణులు

వరదయ్యపాళెం: మారిన వాతావరణం.. కొద్ది రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలు.. దీనికి తోడు గ్రామాల్లో లోపించిన పారిశుద్ధ్యంతో పల్లె ప్రజలు జ్వరాల బారినపడుతున్నారు. ప్రతి ఇంట్లో జ్వర బాధితులే ఉన్నారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు బాధితులు క్యూ కడుతున్నారు. ప్రధానంగా జ్వరాలతో ఆర్ఎంపీ వైద్యుల పంట పండుతోంది. ప్రాథమిక వైద్యం చేయాల్సిన వీరు ఏకంగా ఎంబీబీఎస్‌లకు మించి చికిత్సలందించేస్తున్నారు. నియోజకవర్గంలోని 7 మండలాల్లో 9 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఒక కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ ఉండగా వాటికి రోజువారీ 600 పైచిలుకు జ్వర బాధితులు వైద్యం కోసం వస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం సీజనల్, వైరల్ జ్వరాలు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందస్తుగా ప్రజలను అప్రమత్తం చేయడంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు విఫలమయ్యారని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

వరదయ్యపాళెంలో డెంగీ కేసులు

మండల కేంద్రమైన వరదయ్యపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో డెంగీ కేసులు నమోదైనట్లు సమాచారం. చిన్నారులు సైతం విషజ్వరాల బారిన పడి అవస్థలు పడుతున్నట్లు బాధిత కుటుం బ సభ్యులు ఆవేదన చెందుతున్నారు. ప్రధానంగా వరదయ్యపాళెం పంచాయతీలో డ్రైనేజీలు లేక ఎక్కడికక్కడ మురుగునీరు నిల్వ చేరుతోంది. దీంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. ఈ మేరకు చెన్నవారిపాళెం, వరదయ్యపాళెం టౌన్, దళితవాడ, వడ్డిపాళెం, గోవర్ధనపురం ప్రాంతాల్లో జ్వర బాధితులు ఎక్కువగా ఉన్నట్లు సమాచారం.

లోపించిన పారిశుద్ధ్యం

గ్రామాల్లో పారిశుద్ధ్య ఇబ్బందులు తలెత్తాయి. పూర్తిస్థాయిలో మురుగునీటి కాలువలు లేకపోవడంతో ఇళ్ల నుంచి వ్యర్థజలాలను రోడ్లపైకి వదిలేస్తున్నారు. ఇవి తీవ్ర ఆరోగ్య సమస్యలకు కారణమవుతున్నాయి. అలాగే పంచాయతీ కొళాయిలకు నీరు సరఫరా అయ్యే ఓవర్‌హెడ్ ట్యాంకుల శుభ్రత అంతంత మాత్రంగా ఉంటోంది.



చెన్నవారిపాళెంలో కదలని మురుగు

సమన్వయం లేక ఇబ్బందులు

గ్రామాలలో అటు వైద్యఆరోగ్యశాఖ, ఇటు పంచాయతీ సిబ్బంది సమన్వయ లోపంతో ప్రజలను అప్రమత్తం చేయడంలో విఫలమవుతున్నారు. కేవలం సమావేశాలలో మాత్రం సమష్టిగా ముందుకెళ్లాలని చెబుతుంటారు. ఆచరణలో మాత్రం ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు వ్యవహరిస్తుంటారు.

ఊసేలేని వైద్య శిబిరాలు

వరదయ్యపాళెం మండలంలో జ్వరాలు, వ్యాధులు ప్రబలుతున్నా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం లేదు. ఫీవర్ సర్వే చేపట్టడం గానీ, మెరుగైన వైద్యం అందించడం గానీ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

గతంలో జగనన్న సురక్ష

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించారు. ప్రతి 6 నెలలకు ఒకసారి వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి అన్నిరకాలపరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించేవారు. పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే సంకల్పంతో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యానికి పెద్దపీట వేశారు. ప్రస్తుతం నాణ్యమైన వైద్యం దూరంగా, భారంగా మారిన నేపథ్యంలో జ్వరాలు, సీజనల్ వ్యాధులు పెరిగి ప్రజలు నరకం చూస్తున్నారు.



వరదయ్యపాళెంలోని ఆర్ఎంపీ వైద్యశాలలో..





గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మందులు అందజేస్తున్న వైద్యులు (ఫైల్), నాగలాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓపీ నమోదు

వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడితో నేతల భేటీ



సుధాకర్‌బాబుతో వైఎస్సార్‌సీపీ నేతలు

శ్రీకాళహస్తి: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీసెల్ అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్‌బాబును శనివారం శ్రీకాళహస్తికి చెందిన పార్టీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ముక్కంటి శేషవస్త్రంలో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. నేతలు పసల కృష్ణయ్య, శివశంకర్, అంకయ్య, రాజా, సుధాకర్, శేఖర్, సుభాష్ పాల్గొన్నారు.

అధ్వాన్నంగా పారిశుద్ధ్యం



పేరుకుపోయిన చెత్త

నాగలాపురం: స్థానిక ఆరోగ్యం కేంద్ర వద్ద బస్ షెల్టర్ ఎదురుగా పారిశుద్ధ్యం అధ్వాన్నంగా తయారైంది. దీంతో ఆ ప్రాంతం తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు సైతం విపరీతంగా వ్యాప్తి చెందుతున్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే పంచాయతి అధికారులు స్పందించి చెత్తాచెదారాలు తొలగించాలని కోరుతున్నారు.

కోళ్ల వ్యర్థాలు వేస్తే కేసు



కాలువ పక్కన కోళ్ల వ్యర్థాలు

సత్యవేడు: చికెన్ షాపు నిర్వాహకులు కోళ్ల వ్యర్థాలను గంగ కాలువ రోడ్డు పక్కన వేస్తే కేసు నమోదు చేసి జైలుకు పంపుతామని జూనియర్ కోర్టు సివిల్ జడ్జి వెంకటనాగరాజు హెచ్చరించారు. శనివారం ఆయన మాట్లాడుతూ జనసంచార ప్రాంతాల్లో కోళ్ల వ్యర్థాలు వేయరాదని సూచించారు. ఈ క్రమంలోనే గంగ కాలు రోడ్డును శుభ్రంగా ఉంచేందుకు పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

మారిషస్ పీఎం పర్యటనపై సమీక్ష



అధికారులతో సమావేశమైన కలెక్టర్ వెంకటేశ్వర్

రేణిగుంట: మారిషస్ ప్రధానమంత్రి నవీన్ చంద్ర రాంగులా ఈనెల 15వ తేదీన తిరుపతిలోని రామాపురంలోని బ్రహ్మర్షి ఆశ్రమాన్ని సందర్శించి అనంతరం తిరుమల శ్రీవారి దర్శనం చేసుకోనున్న నేపథ్యంలో చిన్నపాటి లోపాలకు కూడా తావివ్వరాదని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. శనివారం రేణిగుంట విమానాశ్రయంలో జిల్లా కలెక్టర్ డా.ఎస్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, అడిషనల్ ఎస్పీ వెంకట్రావు, సంబంధిత అధికారులతో పర్యటన భద్రత ఏర్పాట్లపై సమీక్షించారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్డీఓ భాను ప్రకాష్ రెడ్డి, తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, బ్రహ్మ రిషి ఆశ్రమం అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం



ఆటోలో కిక్కిరిసిన విద్యార్థులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో ప్రభుత్వ పాఠశాలల విలీనంతో దూరంలోని మరో బడి వెళ్లేందుకు విద్యార్థులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. దీంతో కొంతమంది ఆటోవాలాలు పరిమితికి మించి పిల్లలను ఎక్కించేస్తున్నారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను రద్దు చేసి ప్రైమరీ, జెడ్పీ ఉన్నత పాఠశాలలో విలీనం చేశారు. బుచ్చినాయుడుకండ్రిగలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రతి రోజూ వందల సంఖ్యలో విద్యార్థులు వస్తుంటారు. ప్రధాన రహదారికి దూరంలో ఉండే విద్యార్థులు రాకపోకలకు బస్సులలో కాకుండా ఆటోలు ఎక్కుతున్నారు. ఇదే అదనుగా ఆటోవాలాలు 15 నుంచి 20 మంది విద్యార్థులను తీసుకెళుతూ వారి ప్రాణాలను ప్రమాదంలో పడేస్తున్నారు. విద్యార్థులకు అందుబాటులో ఉన్న పాఠశాలలను రద్దు చేసి, వారి ప్రాణాలతో కూటమి ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

శనీశ్వరస్వామికి తైలాభిషేకం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. నువ్వుల నూనె, మంచి నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని పుష్పాలతో విశేషంగా అలంకరించారు. ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

17 నుంచి 'నారీ స్వశక్త్ సర్వే'

నారాయణవనం: మహిళ ఆరోగ్యం కోసం స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ సర్వేను ఈనెల 17వ తేదీ నుంచి చేపట్టనున్నట్లు వైద్యాధికారి దర్శిత్‌రాజ్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 2వ తేదీ వరకు సర్వే కొనసాగుతుందన్నారు. ఆరోగ్య కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి మహిళల ఆరోగ్య వివరాలు సేకరించాలని ఆదేశించారు. ఆరోగ్య సూత్రాలు, మంచి ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించాలని కోరారు.

ముక్కంటి సేవలో పీఠాధిపతి



ఆలయం వద్ద చంద్రకాళీ ప్రసాద మాతాజీ

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం గుంటూరు జిల్లా నంబూరు కాళీవన ఆశ్రమ పీఠాధిపతి చంద్రకాళీ ప్రసాద మాతాజీ తన శిష్యబృందంతో సేవించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు వారికి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఏఈఓ మోహన్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ వెంకటస్వామి, శుకబ్రహ్మాశ్రమ మేనేజర్ వరప్రసాద్ పాల్గొన్నారు.

అదాలత్ తీర్పు అంతిమం



మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాసనాయక్



మాట్లాడుతున్న న్యాయమూర్తి వెంకటనాగరాజు

శ్రీకాళహస్తి: లోక్ అదాలత్ తీర్పు అంతిమమని శ్రీకాళహస్తి 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. శనివారం పట్టణంలోని కోర్టు ఆవరణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. న్యాయమూర్తులు బేబీరాణి, శ్రీకాంత్‌తో కలిసి శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ వివిధ కేసుల ద్వారా రూ.88,47,261 నగదును రికవరీ చేసినట్లు వెల్లడించారు.

సత్యవేడులో 308 కేసుల పరిష్కారం

సత్యవేడు: స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్అధాలత్‌లో 308 కేసులు పరిష్కరించి రూ. 35,05,262 రికవరీ చేసినట్లు న్యాయమూర్తి వెంకట నాగరాజు తెలిపారు. పెండింగ్ కేసుల పరిష్కారమే లక్ష్యంగా లోక్ అదాలత్ నిర్వహించినట్లు వెల్లడించారు.

సీఐటీయూ ప్రాంతీయ కమిటీ ఎన్నిక



నూతన కమిటీ

తొట్టంబేడు: సీఐటీయూ శ్రీకాళహస్తి ప్రాంతీయ కమిటీని శనివారం ఎన్నుకున్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శ్రీకాళాహస్తి, తొట్టంబేడు మండలాల మహా సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాంతీయ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొప్పల గురునాథం, ప్రధాన కార్యదర్శిగా పెనగడం గురవయ్య, కోశాధికారిగా రేవతితో పాటు మరో 15 మంది సభ్యులుగా ఎన్నికయ్యారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం ,ఉపాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరిగడ్డి యంత్రంతో లాభాలు



గడ్డిని కట్టలు కట్టే యంత్రం

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వం రాయితీపై రైతులకు పంపిణీ చేస్తున్న వరిగడ్డిని కట్టలు కట్టే యంత్రంతో లాభాలు ఆర్జించవచ్చని వ్యవసాయశాఖ అధికారులు శనివారం వెల్లడించారు. రూ.3.60 లక్షల విలువైన ఈ యంత్రాన్ని 50 శాతం సబ్సీడిపై రూ.1.80 వేలకే అందిస్తున్నట్లు తెలిపారు. ఈ యంత్రంతో గడ్డి మోపులు కడితే గడ్డి వృథా కాదన్నారు. ఒక మోపు గడ్డిని కడితే రూ.25 తీసుకుంటున్నారని వివరించారు.

కమనీయం.. కల్యాణం



ప్రత్యేక అలంకారంలో దేవదేవేరులు

తొట్టంబేడు: శ్రీకాళహస్తి మండలం తొండమార్‌పురంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని శనివారం కమనీయంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవదేవేరులకు విశేష అభిషేకం జరిపించారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ డిప్యూటీ ఈఓ నాగరత్న, ఇన్‌స్పెక్టర్ సుధీర్, ప్రధాన అర్చకుడు రమణస్వామి పాల్గొన్నారు. ఈ క్రమంలోనే అధ్యాపకులు రాధ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేపట్టారు.

కూటమిలో 'నామినేటెడ్' చిచ్చు!

- సహకార సంఘాల కమిటీల్లో టీడీపీ నేతలకే స్థానం
- మొండిచేయి చూపడంతో జనసేన, బీజేపీ శ్రేణుల ఆగ్రహం



వరదయ్యపాలెంలోని కదూరు సహకార సంఘ కార్యాలయం

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గంలో సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీలను నామినేటెడ్ పద్ధతిలో నియమిస్తూ ప్రభుత్వం రెండు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు నియోజకవర్గంలో 7 సహకార సంఘాలు ఉండగా బీఎన్‌కండ్రిగ మినహాయించి మిగిలిన 6 సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీలను నియమించింది. అయితే కూటమిలో భాగస్వాములైన జనసేన, బీజేపీలకు త్రిసభ్య కమిటీల్లో చోటు దక్కలేదు. దీంతో 6 సహకార సంఘాలకు సంబంధించి ఏకపక్షంగా టీడీపీకి చెందిన వారినే చైర్మన్, సభ్యులుగా నియమించారు. ఒక్క సత్యవేడు సహకార సంఘానికి మాత్రం సభ్యుని హోదాలో బీజేపీ నేతకు అవకాశం కల్పించారు. జనసేనకు అసలు ఎక్కడా చోటు లభించలేదు. దీంతో జనసేన, బీజేపీ శ్రేణులు భగ్గుమంటున్నాయి. తమ పార్టీలకు చెందిన ముఖ్యనేతలకు వేర్వేరుగా ఫిర్యాదు చేశాయి. ఎన్నికల్లో తమను వాడుకుని, నామినేటెడ్ పదవుల విషయంలో పక్కన పెట్టడం ఏంటని ప్రశ్నిస్తున్నాయి. ఇదివరకు ఆయకట్టు ఎన్నికల్లో టీడీపీ నేతలు ఏకపక్షంగా వ్యవహరించారని, ఇప్పుడు సహకార త్రిసభ్య కమిటీల్లో సైతం అదే ధోరణి ప్రదర్శించారని మండిపడుతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే సస్పెన్షన్‌కు గురి కావడం, తాజాగా టీడీపీ ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్‌గా శంకర్ రెడ్డి నియమితులు కావడంతో వీరి మధ్య ఇప్పటికే అంతర్గత కుమ్ములాటలున్నాయి. ఈ నేపథ్యంలో తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని జనసేన, బీజేపీ కార్యకర్తలు వాపోతున్నారు.

కనీస సమాచారం లేదు

నియోజకవర్గంలో 6 సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీలను నియమిస్తే కనీస సమాచారం ఇవ్వలేదు. అన్ని విషయాల్లో మమ్మల్ని పక్కన పెడుతున్నారు. ఇది సరైన పద్ధతి కాదు. దీనిపై టీడీపీ రాష్ట్ర, జిల్లా నేతల దృష్టికి తీసుకెళ్లాం. రాతపూర్వకంగా ఫిర్యాదు చేశాం. అలాగే ఈ విషయంలో విచారణ చేసి నిర్ణయం తీసుకుంటామని మా పార్టీ అధినాయకత్వం తెలిపింది.

– వేలూరు పురుషోత్తమ్, బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు, వరదయ్యపాళెం